

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 13 పుష్పం : 17

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 17-12-98, జిన్నూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఒక గృహస్థుడు భగవాన్ దగ్గరకు వచ్చి చేయవలసిన పనులు అన్నీ పూర్తి చేసాను, భాధ్యతలు ఏమీలేవు అయినా నామనస్సు కుదురుగా ఉండటంలేదు, నా మనస్సుకు శాంతి లేదు అని అడుగుతున్నారు. నీ మనస్సు కనుక హృదయంలో నిలబడి ఉంటే దానికి స్వస్థత చేకూరుతుంది అని భగవాన్ చెప్పారు. సంసార కారణాలు బయటలేవు, మనస్సులోనే ఉన్నాయి. మంచిఅలవాట్లు, చెడుఅలవాట్లు మనస్సులోనే ఉన్నాయి. మంచిఅలవాట్లు పెంచుకొంటూ ఉంటే మనస్సు అణగటానికి, మనస్సుని నిగ్రహించటానికి మంచిఅలవాట్లు సహకరిస్తాయి. మంచిఅలవాట్లు జ్ఞానం పొందటానికి సహకరిస్తాయి. జ్ఞానం లేకపోతే అజ్ఞానం నశించదు. ఈ అలవాట్లు, తలంపులు ఎక్కడ నుండి వస్తున్నాయి అంటే విషయాలను చింతిస్తున్నాము కాబట్టి తలంపులు వస్తున్నాయి. తలంపులకు ఆధారం విషయచింతన. విషయచింతన మామూలుగా అణగదు. దైవాన్ని చింతిస్తూ ఉంటే, ఆత్మను చింతిస్తూ ఉంటే విషయచింతన అణిగిపోతుంది, మనస్సు అణిగిపోతుంది, దుఃఖం నశిస్తుంది.

మన మాటలో, చేతలో, ఆలోచనలో అహంభావనను ఎక్కువగా ఉపయోగిస్తాము. అందువలన అది పెరిగిపోతుంది. దైనందిన జీవితంలో అహంభావన యొక్క వ్యహారం తగ్గించాలి. మనస్సుకు విశ్రాంతి ఇవ్వాలి. మనస్సును నిశ్చలంగా, శాంతిగా ఉంచితే మీకు ఏకాగ్రత కలుగుతుంది, పవిత్రత కలుగుతుంది. మన మనస్సు ఇరుకుగా ఉంటుంది. దానినుండి మనస్సును విశాలంచేస్తే మామూలుగా రోజు మనలను భాద పెట్టే తలంపులు వాటి అంతట అవే రాలిపోతాయి. మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పడు గర్వం రాకుండా చూసుకోవాలి. మహా సామ్రాజ్యాధిపతులే వట్టిచేతులతో వెళ్ళిపోయారు. మనకు ఉన్న పదవులు, గౌరవాలు, ఆస్తులు ఎంత ? నీకు ఉన్న చిన్న చిన్న అవకాశములను చూసి గర్వం తెచ్చుకోవద్దు. వినయంగా ఉంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులు అవుతారు. వినయం వలన మనకు విజ్ఞానం కలుగుతుంది. ఏకారణం వలన అయినా మనకు గర్వం వస్తే మనం పాడైపోయే రోజులు దగ్గరగా ఉన్నట్లు గుర్తు. విద్య లేకుండా మాయ నశించదు. ఆత్మవిద్యను సంపాదిస్తే మాయ నశిస్తుంది. ఎవరు ఏది చెప్పినా మీ ఆలోచనను, వివేకాన్ని విడిచి పెట్టుకోవద్దు. విచారణా

మార్గానికి వివేకం చాలా ముఖ్యం. వివేకం వలన కూడా మనస్సు అణుగుతుంది. వివేకంతో జీవించే వాడికి నాలుగురోజులు ముందో, వెనకో జ్ఞానం కలుగుతుంది. నిరంతరము దైవాన్ని ధ్యానించటం వలన మనస్సు ఉపసంహరింపబడుతుంది.

భగవంతుని ధ్యానం చేయగా చేయగా ఆయన అనుగ్రహం మన బుద్ధికి అందుతుంది. అయితే దానికి కొంతకాలం పడుతుంది, తొందరపడవద్దు. మనకు జ్ఞానం వస్తుందా, రాదా అని సందేహం పెట్టుకోవద్దు. మీరు అందరూ జ్ఞానానికి వారసులే. మీరు జ్ఞానానికి వారసులు కాదు అనుకోండి. మీరు ఇక్కడకు కూడా రారు. అందరికి జ్ఞానం కలుగుతుంది. ఇందులో సందేహంలేదు. మీ తలంపులు మిమ్మల్ని బాధపెట్టినప్పడు మనకు జ్ఞానం కలుగదేమో, శాంతి కలుగదేమో అని మీకు అనిపిస్తుంది. కాని భగవంతుడు మీ జీవితాన్ని ఎప్పడు మలుపు త్రిప్పతాడో మనం చెప్పలేము. భగవంతుడు టైము చూసుకొని మీకు అంతర్‌దృష్టిని కలుగజేసి మీరు శాంతిలో స్థిరపడేటట్లు చేస్తాడు. కంగారు పడవద్దు. మీరు విచారణ చేయగా ఆత్మ యొక్క మాధుర్యం, దానియొక్క వైభవం మీకు తెలుస్తుంది. ఎప్పడైతే ఆత్మసాక్షాత్కారం అయిందో, మీ ఉపాధి ద్వారా దాని పరిమళం, దానికాంతి ఈ ప్రాంతమే కాదు మొత్తం ప్రపంచాన్ని అంతా చుట్టుకొంటుంది. మీ ద్వారా అనేక మంది బాగుపడతారు. మన ఇంటిలో ఉన్న వస్తువులను అవసరమైనప్పడు ఉపయోగించుకొంటాము. తరువాత ఒక ప్రక్కన పెడతాము. అలాగే మన మనస్సును, దేహమును అవసరం అనుకొన్నప్పడు ఉపయోగించుకోవాలి, అంతేగాని అవే మనం అని అనుకోకూడదు. మనం కాని విషయాలను మనం అని ఎన్నిసార్లు అనుకొన్నా మనం అవ్వలేము. వాటిలో నుండి మనం విడిపోవటం తప్పదు. మీ మనస్సును, శరీరమును ఆరోగ్యంగా ఉంచుకొని మోక్షాన్ని సంపాదించుకోవటానికి ఈ రెండింటిని ఉపయోగించుకోవాలి. బ్రహ్మం తప్పించి మిగిలినవి అన్నీ స్వప్నంతో సమానము. మనస్సు కుదురుగా ఉండకపోవటానికి మమకారం కారణం. మమకారాన్ని త్యాగం చేస్తే అహంకారం పోవటానికి అది సహకరిస్తుంది.

నిద్ర అంటే అందరికీ ఇష్టమే ఎందుచేతనంటే ప్రతీ మానవుడు నిద్రలో సుఖంగా ఉంటున్నాడు. అందువలన వాడు నిద్రను కోరుకొంటున్నాడు. నిద్రలో వాడికి హద్దులు లేవు, పరిమితులు లేవు, ఏమీ ఉండవు, సుఖంగా ఉంటాడు. జాగ్రదావస్థలోనికి రాగానే దేహంతో తాదాత్మ్యం పొందే తలంపు వస్తోంది. అదే పరిమితులను తీసుకొని వస్తోంది. పరిమితులనుండి దుఃఖం వస్తోంది. అంతటా నేను ఉన్నాను అనే అనుభవం వచ్చినప్పడు ఇంక ఆ మనిషికి దుఃఖం లేదు. మోక్షం అంటే ఎక్కడో ఉంది, ఎప్పడో వస్తుంది అని అనుకొంటున్నాము ఏమీలేదు జాగ్రదావస్థలో గాఢ నిద్ర స్థితిని తెచ్చుకొంటే మోక్షం వచ్చేస్తుంది. మాటకంటే మౌనం ఆత్మజ్ఞానానికి సహకరిస్తుంది. అవసరమయిన దానికంటే తనను తాను పొగడుకోవటంకోసం, ఇతరులను నిందించటంకోసం మనిషి ఎక్కువగా మాట్లాడతాడు. ఇవి రెండూ చాలా ప్రమాదం. వీటివలన

దేహబుద్ధి పెరిగిపోతుంది. అసూయ ఉంటే ఇతరులలో ఉన్న మంచిగుణం కూడా మీకు చెడ్డ గుణంగా కనబడుతుంది. అసూయ ఉన్నది ఉన్నట్టుగా గ్రహింపనీయదు. దానివలన మనం చాలా నష్టపోతాము. చేతితో మనం చెడ్డపనిచేయనక్కరలేదు. నోటితో చెడు మాట్లాడ నక్కరలేదు, కనీసం మనస్సులో చెడు తలంపు వచ్చినా దానికి కూడా ఈ జన్మలో కాకపోయినా, రాబోయే జన్మలో అయినా భగవంతుడికి మనం సమాధానం చెప్పవలసి ఉంటుంది. గీతలో భగవంతుడు ఏపని అయితే చేయమని చెప్పాడో ఆపని చేయటం వలన మనం పవిత్రులమవుతాము. ధ్యానం చేయటంవలన ఏకాగ్రత కలుగుతుంది. సూక్ష్మబుద్ధి కలుగుతుంది. సూక్ష్మబుద్ధివలన మీతలంపులలోని దోషాలు, వాటివలన పరిణామంలో వచ్చే దుఃఖం మీకు స్పష్టంగా తెలుస్తుంది.

నీకు చాలా మంది స్నేహితులు ఉండవచ్చు, నిజమైన స్నేహితుడు ఎవడు? నీవు చెడ్డపనులు చేయకుండా, బలహీనతలలో కొట్టుకొని పోకుండా ఎవడైతే కాపాడుతున్నాడో వాడే నీకు నిజమైన స్నేహితుడు. కామక్రోధాలను విడిచిపెట్టినవారు కూడా కీర్తి కాంక్షలో నుండి బయటకు రాలేరు. కామక్రోధములు, అసూయ అన్నీ పోగా సాధన యొక్క చివరి అంతస్థులో తపస్సు యొక్క లోతులు పెరిగాక బేదబుద్ధి నశించిన తరువాత కీర్తికాంక్ష పోతుంది గాని బేధ బుద్ధి చింతాకంత ఉన్నా కీర్తి కాంక్షపోదు అని మిల్టన్ చెప్పాడు. ఆత్మజ్ఞానం ఒక్కటే వాస్తవమైన జ్ఞానం మిగతా జ్ఞానాలు అన్నీ మిధ్యాజ్ఞానాలు, నీవు మనస్సుతో నేర్చుకొనే విద్యలు అన్నీ మనస్సు అణిగినప్పడు అవికూడా అణిగిపోతాయి. గాఢనిద్రలో నీ మనస్సు అణిగిన తరువాత కూడా ఒక వస్తువు ఉంది. అది యదార్థం. అదే చైతన్యం, అదే బ్రహ్మం. గాఢనిద్రలో నీకు నేను అనే తలంపులేదు. గాఢనిద్రలో నీవు సుఖంగా ఉన్నావు. జాగ్రదావస్థలో నీకు నేను అనే తలంపు వస్తోంది. జాగ్రదావస్థలో నీసుఖాన్ని నేను అనే తలంపు పాడుచేస్తోంది. నీ సుఖానికి, శాంతికి ఆటంకంగా వచ్చేది నేను అనే తలంపు అనే విషయం గ్రహించు. ఈ దేహానికి, ఈలోకానికి ఈ కర్మకు ఏ నేను అయితే మనల్ని బంధిస్తోందో ఆ నేనుకు మనకు సంబంధం ఏమిటి అని మీరు ప్రశ్నించటంలేదు, దానిని కనీసం మీరు సందేహించటంలేదు. ఇలా కొన్నివేల జన్మలు గడిచిపోతున్నాయి. ఈ నేను అనే తలంపు మీరు అనుకొన్నా అది మీరు అవ్వరు. మీ హృదయంలో ఉన్న బ్రహ్మమే మీరు. ఏదైతే నీవు కాదో దానిలో నుండి నీవు విడిపోవటం తప్పదు.

అందరూ అహంభావనను కేంద్రంగా పెట్టుకొని జీవిస్తున్నారు. అహంభావన లేనివారిని ఆరాధిస్తే అహంభావన లేని స్థితికి వెళతారు. అహంభావన పోగొట్టుకోవటంవలన వచ్చే అంతస్థు, దానివలన వచ్చే జ్ఞానం, దాని ఔన్నత్యం మీరు గుర్తిస్తే, ఆగమ్యం యొక్క విలువ మీకు తెలిస్తే అహంభావనను పోగొట్టుకొని గమ్యంను పొందాలి అని మీరు ప్రయత్నం చేస్తారు. సహనం వలన మీకు శక్తి కలుగుతుంది. సహనంవలన అహంభావన పల్చబడుతుంది. పూజచేస్తున్నారు,

జపంచేస్తున్నారు, ధ్యానం చేస్తున్నారు. సాధన చేస్తున్నాము అనుకొంటున్నారు. సాధనయొక్క గమ్యం ఏమిటి ? నీ సుఖానికి, శాంతికి ఏ నేను అయితే అడ్డువస్తోందో దాని నుండి విడుదల పొందటమే నీ సాధనయొక్క గమ్యం. సాధనచేసి తొలగించుకోవలసింది నేను అనే మొదటి తలంపునే. పూజగదిలో ఉన్నంతవరకు, మీరు జాగ్రత్తగా ఉంటున్నారు. పూజగది నుండి బయటకు వచ్చాక దెయ్యం పట్టినవాడిలా ప్రవర్తిస్తున్నారు. పూజగదిలో ఉన్నప్పుడు వేరు, బయటపని చేసుకొనేటప్పుడు వేరు అనుకొంటున్నారు. ఆ జీవితం వేరు, ఈ జీవితం వేరు అని మీరు అనుకొంటున్నారు. అది వేరు, ఇది వేరు కాదు. అంతా బ్రహ్మమే. అక్కడ ఎలాగ ఉన్నావో లోకంలో కూడా అలాగే ఉండు దీనికి పుణ్యబలం అవసరం. నీ దేహం 100 సంవత్సరాలు ఉంటే అందులో బ్రహ్మంను తెలుసుకోవటానికి నీ మనోదేహములను ఒక్క సంవత్సరం ఉపయోగించుకొంటే ఆ ఒక్క సంవత్సరమే నీవు జీవించినట్లు. మిగతా 99 సంవత్సరాలు వ్యర్థం, ఆ జీవితం అంతా నిప్పులో పెట్టిన కట్టెలతో సమానము. బ్రహ్మం తప్పించి మిగతావి అన్నీ స్వప్నంతో సమానము.

మనస్సును దాని మూలంలో ఉంచటానికి నీకు శక్తి చాలటంలేదు అనుకో, కంగారు పడవద్దు. సజ్జనులతోటి, మహాత్ములతోటి సాంగత్యం నేర్చుకోండి. సత్పురుషులతో సహవాసం వలన మీ మనస్సు మీకు తెలియకుండా హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. భక్తి అభివృద్ధి అవుతూ ఉంటే, మనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతూ ఉంటే దేహాన్ని ముట్టుకొంటే ఆ స్పర్శ మీకు ఎలా తెలుస్తుందో అలాగ ఈశ్వరానుగ్రహం అంత స్పష్టంగా మీకు తెలుస్తుంది. లోకాన్ని చూస్తున్నారు. లోకాన్ని ఎవరు చూస్తున్నారు ? నీ మనస్సు చూస్తోంది. చూచేది ఎంత నిజమో చూడబడేది కూడా అంతే నిజం అన్నారు భగవాన్. చూడటానికి ఏమి ఉంది. ఉన్నది ఒక్కటే వస్తువు. అదే బ్రహ్మం. మీమాటలో బ్రహ్మమును చూడండి. మీ పనిలో బ్రహ్మమును చూడండి. మీదైనందిన జీవితంలో బ్రహ్మమునే చూడండి. ఎటుచూసినా బ్రహ్మమునే చూడండి. ఎవరికైనా సహాయం చేసినా వారిలో కూడా బ్రహ్మమునే చూడండి. ఆ మనిషినికాదు చూసేది బ్రహ్మమునే చూడండి. ఆ మనిషిని చూస్తే మరల మీకు పొగరుబోతుతనం వస్తుంది. మీకు మంచి చేయాలి అనే తలంపు ఎక్కడ నుండి వస్తోంది ? బ్రహ్మము నుండే వస్తోంది. నీవు తెలుసుకోవలసింది బ్రహ్మమునే. తెలుసుకోవాలనే కోరిక తెచ్చేది బ్రహ్మమే. అన్నింటికి ఆధారము బ్రహ్మమే. అందువలన ఎటుచూసినా బ్రహ్మమునే చూడు. బ్రహ్మభావన పెంచుకొంటూ ఉంటే నీకు జీవభావన తగ్గిపోతుంది. బ్రహ్మం బ్రహ్మం అనుకొంటూ మాట్లాడు, బ్రహ్మం బ్రహ్మం అనుకొంటూ పనిచెయ్యి అదే ధ్యాసలో ఉండు బ్రహ్మం అయిపోతావు, జనన మరణ ప్రవాహము నుండి బయటకు వచ్చేస్తావు.

---

Printed & Published By : P.S. RAMARAJU At SHRIRAM GRAPHICS, PALAKOL.